జ్యోతిబసుకు ఘన నివాళి

జనగామ చౌరస్తా, జనవరి 17 : సీపీఎం జాతీయ నాయకుడు, దివంగత పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసు 14వ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు చిత్రపటానికి జిల్లా కార్యదర్శి కనకారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబసు జీవితం నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. రైతులు, కార్మికుల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన నాయకుడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజు, రమేశ్, ఉపేందర్, ప్రకాశ్, విజేందర్, నరేందర్, చందు, మహేందర్, ధర్మభిక్షం, సురేశ్, సుధాకర్ పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణ కోసం ఐక్యంగా నిలవాలి'

జనగామ చౌరస్తా, జనవరి 17 : ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు, ఉప కులాలంతా ఐక్యంగా నిలవాలని ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గంధమల్ల ఉదయ్‌కిరణ్ అన్నారు. బుధవారం జనగామ పట్టణంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో ఏడుగురు సభ్యులతో కూడిన అత్యున్నత ధర్మాసనం విచారణ ప్రారంభించిందన్నారు. ఈ తరుణంలో మాదిగలంతా ఒక్కతాటిపైకి వచ్చి ఉద్యమించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి శ్రావణ్‌కుమార్, దర్శనాల సౌష్టవ్, నవీన్, దీక్షిత్, మహేశ్, శివశంకర్, కిరణ్ పాల్గొన్నారు.

'ఓటు హక్కును నమోదు చేసుకోవాలి'

నర్మెట, జనవరి 17: ఓటరు నమోదుకు ఎన్నికల కమిషన్ మరో అవకాశం కల్పించిందని తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 1 జనవరి 2024వరకు 18సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లలో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునేవారు ఫాం 6, తప్పులు సవరించుకోవడానికి ఫాం 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాకయ్యకు నియామక పత్రం అందిస్తున్న నాయకులు

గౌడ జన హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాకయ్య

పాలకుర్తి, జనవరి17 : గౌడజనహక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని విస్నూరుకు చెందిన బాలగాని యాకయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూల వెంకటేశ్వర్లు సభ్యులతో కలిసి యాకయ్యకు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్షుడు తాళ్ల సోమనారాయణ, రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గిరగాని సమ్మయ్య, మండల అధ్యక్షుడు పొడిశెట్టి వెంకన్న, పూజారి నారాయణ, కుమారస్వామి, యాదగిరి పాల్గొన్నారు.

ఇంటి, నల్లా పన్నులు చెల్లించాలి : ఎంపీడీవో

బచ్చన్నపేట, జనవరి 17 : మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు 2023-24 సంవత్సరానికి సంబంధించి ఇంటి, నల్లా పన్నులు ఈ నెలాఖరులోగా చెల్లించాలని ఎంపీడీవో రఘురామకృష్ణ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే రెండు, మూడు గ్రామాల్లో వందశాతం పన్నుల వసూలు పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాలు ఈ నెలాఖరు వరకు వంద శాతం పూర్తి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు సైతం ప్రతిరోజూ గ్రామాల్లో పన్నుల వసూళ్లకు వెళ్లాలన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి ప్రజలు సహకారం అందించాలన్నారు.

క్షయవ్యాధి నియంత్రణకు కృషి చేయాలి

జిల్లా ప్రోగ్రాం అధికారి అశోక్‌కుమార్

బచ్చన్నపేట, జనవరి 17 : క్షయ వ్యాధి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రోగ్రాం అధికారి లగిశెట్టి అశోక్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయవ్యాధి లక్షణాలు ప్రతి నిమిషానికి గాలి ద్వారా ఇంకొకరికి సోకే ప్రమాదం ఉందన్నారు. ఈ క్రమంలో వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధి నుంచి బయటపడేందుకు మందులు సక్రమంగా వినియోగించడమే ఏకైక మార్గమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను క్షయవ్యాధి లేని గ్రామాలుగా తీర్చిదిద్దితే సంబంధిత గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టీబీ కోఆర్డినేటర్ శ్రీదేవి, మండల వైద్యాధికారి సిద్ధార్థరెడ్డి, డాక్టర్ సృజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫ్ర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-323107

TO-LET

★HNK బాలసముద్రం LIC డివిజన్ ఆఫీస్ ప్రక్కన 1st ఫ్లోర్ 2000 Sft. ఆఫీసెస్, కమర్షియల్, BIG Family కి కిరాయికి ఇవ్వబడును. సంప్ర: సెల్: 9908117447
NTW-323115

WANTED

డ్రైవర్ కావలెను

★ హన్మకొండ, బాలసముద్రంలో కారు నడుపుటకు అనుభవం కలిగిన డ్రైవర్ కావలెను. వెంటనే సంప్ర : సెల్: 9908117447
NTW-323114

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565

సెమీ ఫైనల్స్‌లో తలపడుతున్న వరంగల్, ఖమ్మం బాలుర జట్లు

తలపడుతున్న వరంగల్, ఖమ్మం బాలికల జట్లు

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

- ముగిసిన సెమీ ఫైనల్స్
- నేడు వరంగల్, నల్గొండ జట్ల మధ్య రసవత్తర పోటీ

జనగామ చౌరస్తా, జనవరి 17 : 'స్కూల్ గేమ్స్ ఫెడరేషన్' ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న అండర్-14 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు రెండో రోజూ ఉత్సాహంగా కొనసాగాయి. బుధవారం జరిగిన కబడ్డీ సెమీ ఫైనల్స్‌కు ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి కే రాము హాజరై ప్రారంభించారు. బాలుర విభాగంలో వరంగల్ వర్సెస్ ఖమ్మం జిల్లాల జట్లు తలపడ్డాయి. 34-22 స్కోరుతో వరంగల్ జట్టు ఫైనల్‌కు చేరిందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పోగుల నరేందర్‌గౌడ్ తెలిపారు. నల్గొండ వర్సెస్ మెదక్ జిల్లాలకు జరిగిన పోటీలో 59-15 స్కోరుతో నల్గొండ జట్టు ఫైనల్‌కు చేరిందని ఆయన పేర్కొన్నారు. బాలికల విభాగంలో నల్గొండ వర్సెస్ రంగారెడ్డి జిల్లాల జట్లు తలపడగా 63-15 స్కోరుతో నల్గొండ జట్టు, వరంగల్ వర్సెస్ ఖమ్మంకు జరిగిన పోటీలో వరంగల్ జట్టు 51-43 స్కోరుతో ఫైనల్‌కు చేరిందని నరేందర్‌గౌడ్ చెప్పారు. గురువారం జరిగే కబడ్డీ ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో వరంగల్ వర్సెస్ నల్గొండ జట్లు, బాలికల విభాగంలోనూ వరంగల్ వర్సెస్ నల్గొండ జిల్లా జట్లు పోటీలో తలపడతాయని నరేందర్‌గౌడ్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అకాడమిక్ జిల్లా కోఆర్డినేటర్ బీ శ్రీనివాస్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్ తోటకూరి వెంకటేశ్వర్లు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోగుల సారంగపాణి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్టేట్ అబ్జర్వర్ రవికుమార్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పీడీలు, పీఈటీలు, సీనియర్ కబడ్డీ ప్లేయర్ సురేందర్ పాల్గొన్నారు.

19న అవగాహన సదస్సు

జనగామ చౌరస్తా, జనవరి 17 : జిల్లాలోని డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులకు ఆదాయ పన్ను శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఉదయం 10.30గంటలకు కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అవగాహన సదస్సు ఉంటుందని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-టీడీఎస్ ఫైలింగ్, ట్యాక్స్ చెల్లింపులు, తగ్గింపుపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సదస్సుకు అన్ని శాఖల డీడీవోలతోపాటు ట్రెజరరీ, ఆడిట్ అధికారులు హాజరుకావాలని కోరారు.

22న ఆలయంలో పూజలు

బచ్చన్నపేట, జనవరి 17 : అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న మండలంలోని ఆలింపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి మహంకాళి సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు ఉదయం ఆలయంలో రాములోరికి అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహిస్తున్నందున గ్రామస్తులు ధూపదీప నైవేద్యాలతో తరలిరావాలని ఆయన సూచించారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తి చేయాలి

అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్

ఆలింపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న చంద్రశేఖర్

బచ్చన్నపేట, జనవరి 17 : మండలంలోని అన్ని గ్రామాల్లోని నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు డీఆర్డీవో చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మండలంలోని ఆలింపూర్, కొడవటూరు, బండనాగారం గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు ఇచ్చిన టార్గెట్ మేరకు పనులు పూర్తి చేయాలన్నారు. బ్యాగ్ ఫిల్లింగ్ పూర్తి చేసి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఇందు కోసం రకరకాల విత్తనాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అలింపూర్ లో బ్యాగులు ఫిల్లింగ్ చేసే సమయంలోనే ఎరువు వేసి నింపడం సరైన పద్ధతి అన్నారు. దీనిని అన్ని గ్రామాలు అవలంబిస్తే మొక్కలు తొందరగా పెరిగే అవకాశం ఉంటుందని చంద్రశేఖర్ తెలిపారు. నర్సరీలో రోజుకు రెండుసార్లు నీళ్లు పట్టాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. గతంలో ఉన్న మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురామకృష్ణ, సర్పంచులు నరెడ్ల బాల్‌రెడ్డి, గంగం సతీశ్‌రెడ్డి, ఏపీవో కృష్ణయ్య, టీఏ కరుణాకర్, పంచాయతీ కార్యదర్శులు బాల్నె రేవతిగౌడ్, రూపావైతన్య, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేశ్వర్, మినలాపు రంగ అశోక్, రామకృష్ణ, వన సేవక్ పోలెబోయిన నర్సింహులు పాల్గొన్నారు.

'రైతుబంధు' డబ్బులు వెంటనే అందించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆది సాయన్న

సమావేశంలో మాట్లాడుతున్న సాయన్న

రఘునాథపల్లి, జనవరి 17: యాసంగి పంటలు సాగు చేస్తున్న రైతులకు వెంటనే రైతుబంధు డబ్బులు వారి ఖాతాల్లో జమ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆది సాయన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గొరిగె సోమయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు డబ్బులు సకాలంలో అందించేవారని ఆయన గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని కోరారు. లేదంటే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు కావటి యాదగిరి, మడికంటి సోమయ్య, ముప్పిడి ఎల్లయ్య, చాడ ఎల్లయ్య, పండుగ మల్లేశం, బాల్నె ఉదయ్, చిట్యాల ఉప్పలయ్య, జెనిగల అంజయ్య, ఉడుముల జయమ్మ, కంబాల వెంకన్న, తూడి శ్రీనివాస్, కోమటిరెడ్డి నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సంఘ విద్రోహశక్తుల ఆటలు సాగనివ్వం

స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 17 : సంఘవిద్రోహ శక్తుల ఆటలు సాగనివ్వమని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధమని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు అన్నారు. హకీంపేట నుంచి వచ్చిన 99వ బెటాలియన్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్)కు చెందిన 70మందితో బుధవారం నియోజవర్గ కేంద్రంలో పోలీసు అధికారులు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్ వరకు, అక్కడి నుంచి గాంధీ చౌరస్తా మీదుగా బస్టాండు వరకు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విచ్ఛిన్నకర శక్తులు ఎక్కడ ఉన్నా పోలీసులు గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారన్నారు. సంఘవిద్రోహులు, అనుమానితులు కన్పిస్తే ప్రజలు పోలీసుల దృష్టికి తీసుకరావాలని కోరారు. ప్రజలకు నిరంతరం పోలీసులు అండగా ఉంటారన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతిభద్రతల పరిరక్షణలో తమవంతుగా సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లి సీఐలు సట్లు రాజు, శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ బాగేల్, అసిస్టెంట్ కమాండెంట్ స్వప్నిల్ పవార్, ఇన్స్పెక్టర్లు రాబిన్‌బాబు, జాట శంకర్‌యాదవ్, ప్రకాశ్‌కుమార్ సాహు, కలీద్ ఆహ్మద్, ఎస్సైలు నాగరాజు, రఘుపతి, వినయ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

శబరిమలకు ఇరుముడితో వెళ్తున్న అయ్యప్ప స్వాములు

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

జనగామ చౌరస్తా, జనవరి 17 : హరిహర సుతుడైన అయ్యప్పస్వామి దర్శనం కోసం ఇరుముడి ధరించిన స్వాములు బుధవారం జనగామ పట్టణం నుంచి శబరిమల యాత్రకు తరలివెళ్లారు. స్థానిక మహంకాళి ఆలయంలో బ్రహ్మశ్రీ పుచ్చా నరసింహ గురుస్వామి ఆధ్వర్యంలో ఓరుగంటి సంతోశ్‌కుమార్, కస్తూరి వేణుగోపాల్‌రావు, కొల్లూరి ఆనందం, పోతర్ల శ్రీనివాస్, వట్టుపల్లి రేవంత్, గుగులోత్ శ్రీనివాస్ ఇరుముడితో శబరిమలకు బయలుదేరారు. అంతకుముందు బాణాపురం అయ్యప్ప గుడిలో ప్రధానార్చకుడు కాసోజు రాజేశ్వరాచార్యులు ప్రత్యేకంగా ఇరుముడి పూజ నిర్వహించగా, అయ్యప్పస్వామి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే కడియం పరామర్శ

పార్టీ తరపున ఆదుకుంటామని హామీ

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 17 : మండలంలోని పాంనూర్, అక్కపల్లిగూడెం గ్రామాల్లో అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. పాంనూర్‌కు చెందిన ఒగ్గు యాదగిరి(40), అక్కపల్లిగూడేనికి చెందిన యార సంపత్(40) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మృతుల కుటుంబాలను పరామర్శించారు. పార్టీ తరపున ఆదుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇదిలా ఉండగా యార సంపత్ మృతదేహానికి అతడి ఎనిమిదేళ్ల కుమారుడు తలకొరివి పెట్టడంతో చూపరులను కలిచివేసింది. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు బెలిదె వెంకన్న, రాజేశ్‌నాయక్, సర్పంచ్ కోతి రేణుకారాములు, ఎంపీటీసీ బూర్ల లతాశంకర్, యార(సెల్)కొమురెల్లి, పల్లె రవి, ఎల్లగౌడ్, సట్ల యాకయ్య, యార సోమయ్య, రవి ఉన్నారు.

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

జనగామ చౌరస్తా, జనవరి 17 : జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లోని మైనార్టీ గురుకుల బాలబాలికల పాఠశాల/కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో 5, 6, 7, 8వ తరగతితోపాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి సయ్యద్ ఇస్మాయిల్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హులైన విద్యార్థులు నేటి నుంచి www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా వచ్చే నెల 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. మైనార్టీతోపాటు నాన్ మైనార్టీ విద్యార్థులు కూడా ఆయా తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 9346951278, 9951933034లలో సంప్రదించాలని సయ్యద్ ఇస్మాయిల్ సూచించారు.

'సమాజ సేవలో భాగస్వాములు కావాలి'

లయన్స్‌క్లబ్ జనగామ జిల్లా గవర్నర్లు కన్నా పరశురాములు, డాక్టర్ లవకుమార్‌రెడ్డి

అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

జనగామరూరల్, జనవరి 17 : ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని, అవసరార్థులకు సాయం అందించాలని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్లు కన్నా పరశురాములు, డాక్టర్ లవకుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం చంపక్‌హిల్స్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ నేతృత్వంలో కొన్ని నెలలుగా జనగామలోని ఎంసీహెచ్‌లో ఉచిత అన్నదానం, అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 300మంది రోగులకు, వారికితోడుగా వచ్చే వారికి నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్లు రాజశేఖర్‌రెడ్డి, రాపాక విజయ్, కోఆర్డినేటర్లు జైన రమేశ్, శ్రీభాష్యం రఘు, క్లబ్ ప్రతినిధులు రవీందర్, గంగిశెట్టి ప్రమోద్, మధు, సురేశ్, యాదగిరి, కృష్ణజీవన్‌బజాజ్, వెంకట్‌రెడ్డి, ఆల్లాడి మహేశ్, రాజయ్య, నవీన్‌గుప్తా, రమేశ్, శివరామకృష్ణ, వెంకట్, మల్లారెడ్డి, శ్రీనివాస్, యంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

'అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి'

కొడకండ్ల, జనవరి 17 : వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అర్హులైన పేదలకు అందేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయిని రమేశ్, ఎంపీటీసీ-2 అందె యాకయ్య, కో ఆప్షన్ సభ్యుడు ఎండీ నజీర్, గుండె విజయరామారావు, లేగ రామ్మోహన్‌రెడ్డి, డాక్టర్ హరికృష్ణ, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రైతుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం'

పాలకుర్తి, జనవరి 17 : రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుబంధు పథకంలో ఇంత వరకు రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయలేదన్నారు. ఎకరం భూమి ఉన్న కొంత మందికి మాత్రమే పంట సాయం అందిందన్నారు. మిగిలిన రైతుల ఖాతాల్లో డబ్బులు వేయకపోవడంతో యాసంగి సీజన్‌లో పంటల పెట్టుబడికి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నదని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంట సాయం అందించాలని డిమాండ్ చేశారు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'



తరిగొప్పులలో ఆందోళన నిర్వహిస్తున్న గీత కార్మికులు

తరిగొప్పుల, జనవరి 17 : సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని మండల కేంద్రంలో ప్రతిష్ఠించేందుకు నిర్మిస్తున్న గద్దెను కొందరు దుండగులు కూల్చివేశారని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి తెలిపారు. దీనికి బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కూల్చిన గద్దె స్థలాన్ని బుధవారం ఆయన నాయకులతో కలిసి సందర్శించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బూడిద గోపి మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల మనోభావాలు దెబ్బతీసేలా మాశెట్టి వేణుగోపాల్, మాశెట్టి శ్రీనివాస్, సందీప్ రాత్రి వేళ గద్దెను కూల్చివేశారని ఆరోపించారు. సర్వాయి పాపన్నగౌడ్ 350ఏళ్ల క్రితమే ఢిల్లీ సుల్తాన్లను, పెత్తందార్లను ఎదురించి పోరాడిన యోధుడన్నారు. పాపన్న కీర్తిని గత బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించిందని ఆయన గుర్తు చేశారు. పోరాట యోధుడిని అవమానపర్చేలా పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపన కోసం నిర్మిస్తున్న గద్దెను కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దుండగులపై తీసుకోవాలని వారు పోలీసు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకటమల్లయ్య, ఉపాధ్యక్షులు జొన్నగాని శ్రీనివాస్, మండల అధ్యక్షులు తాళ్లపల్లి పోశయ్య, కార్యదర్శి సుధాకర్, నాయకులు వంగ రామరాజు, జాగీర్, మల్లేశ్, శంకరయ్య, విజయ్, రమేశ్, సత్యనారాయణ, రాములు, శ్రీనివాస్, రవి, లింగం, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

నూతన అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నర్సయ్య

రఘునాథపల్లి జనవరి 17 : మండలంలోని భాంజీపేటలో శ్రీ కనకదుర్గ ఆటో యూనియన్ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా ఉడుగుల నర్సయ్య, కార్యవర్గ సభ్యులుగా కన్న భాస్కర్, ఎండీ యాకూబ్‌పాషా, నామాల మల్లయ్య, రాగిరి నర్సయ్య, కూరాకుల వీరయ్య, రాగిరి కృష్ణ, కనకంటి భాస్కర్, కన్న సురేశ్, మధు, ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు.